సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



రైతులను ఆదుకోవాలి

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. 8లో



ఉద్యోగ భద్రత కల్పించాలి

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు జిల్లా వ్యాప్తంగా గురువారం నిరాహార దీక్షలు చేపట్టారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
38° / 24°

జిల్లాలో శుక్రవారం ఎండ ప్రభావం అధికంగానే ఉంటుంది. మధ్యాహ్నం వేళ గరిష్ట ఉష్ణోగ్రత నమోదవుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాధపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ఆ తర్వాత అర్చకులు అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపతి రామలింగం, ఈఓ ఎన్.రజనీకుమారి, డైరెక్టర్లతో పాటు అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు. కాగా, ఆలయంలో వచ్చేనెల 5న చండీ హోమం నిర్వహించనున్నామని, పాల్గొనాలనుకునే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని ఈఓ కోరారు. వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

3 నుంచి సదరం క్యాంపులు

నేటి నుంచి స్లాట్ బుకింగ్‌కు అవకాశం

చుంచుపల్లి: జిల్లాలోని దివ్యాంగుల కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మే 3 నుంచి 30 వరకు సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరు కావాలనుకునే వారు శుక్రవారం నుంచి మీ – సేవా కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసేందుకు పీహెచ్‌సీ వైద్యులు జారీ చేసిన దివ్యాంగ గుర్తింపు సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను మీ సేవా కేంద్రానికి తీసుకెళ్లాలని, రూ.35 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మే 3, 10, 17, 24, 30 తేదీల్లో క్యాంపులు ఉంటాయని వివరించారు. 21 విభాగాల్లో సదరం క్యాంపులు నిర్వహించి ధ్రువపత్రాలు ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం ఆరు, ఏడు విభాగాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుంటూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఏకలవ్య పాఠశాలల రాష్ట్ర ఓఎస్‌డీ స్వర్ణలత సూచించారు. కొత్తగూడెం రామవరంలోని ఏకలవ్య పాఠశాలలో ఏర్పాటుచేసిన వాయిస్ ఫర్ గర్ల్స్ వేసవి శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడుతూ వేసవి సెలవులను వృథా చేయకుండా శిక్షణలో కొత్త అంశాలు నేర్చుకోవాలని తెలిపారు. ఏకలవ్య పాఠశాల విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు వాహేద్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షకు 716 మంది హాజరు

కొత్తగూడెంఅర్బన్: ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన పదో తరగతి ఉర్దూ పరీక్షకు 9 మందికి ఏడుగురు, మధ్యాహ్నం జరిగిన హిందీ పరీక్షకు 12 మందికి 10 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు కొత్తగూడెంలోని 5 కేంద్రాల్లో 857 మందికి 716 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల అకడమిక్ అధికారి ఎస్.మాధవరావుతో పాటు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్షలను తనిఖీ చేశాయి.

నేడు రామాలయంలో ఆభరణాలపై ఆడిట్

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి బంగారం, వెండి లెక్కలు తేల్చనున్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఈఓ రమాదేవి ఆలయానికి చెందిన ఆభరణాలతో పాటు బంగారం, వెండి లెక్కించి అప్పగించాలని దేవాదాయ శాఖ కమిషనర్‌కు విన్నవించారు. దీంతో హైదరాబాద్ నుంచి జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి నేడు భద్రాచలం వస్తున్నారు. అతడితో పాటు గత ఈఓ బి.శివాజీ, ప్రస్తుత ఈఓ రమాదేవి, ఇతర సిబ్బంది పాల్గొంటారు. స్వామివారికి ఉన్న బంగారం, వెండి నిల్వలపై గత కొన్నేళ్లుగా అయోమయం నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో ఆలయంలో చేపట్టబోయే ఆడిట్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది.



అడ్డగోలుగా తవ్వేస్తున్నారు..

మా పని అంతే..

ఇసుక అక్రమ మాఫియాను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా మైనింగ్, టీఎస్‌ఎండీసీ, రవాణా, పోలీస్, రెవెన్యూ విభాగాలపై ఉంది. ఎవరైనా ఈ అవినీతి వ్యవహారంపై ఫిర్యాదు చేసినా ప్రతీ శాఖలో సంబంధిత అధికారులు ఆ బాధ్యత తమది కాదని, మరో శాఖదని సమాధానం చెప్పడం పరిపాటిగా మారింది. ఇసుక దందాపై టీఎస్‌ఎండీసీ అధికారులను ప్రశ్నిస్తే ఇసుక అమ్మకాలను పర్యవేక్షించడమే తమ పని తప్పితే తవ్వకాల నిర్వహణతో తమకు సంబంధం లేదంటారు. కీలకమైన మైనింగ్ శాఖను ప్రశ్నిస్తే అనుమతులు ఇవ్వడమే తమ పని అని చెబుతారు. లేదంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని జవాబిస్తారు. ఇంత వరకు ఏ ఒక్క రీచ్‌లో ఇసుక తవ్వకాలకు ఎంత పరిధి మేరకు అనుమతి తీసుకున్నారు ? ఎంత వరకు తవ్వారు? అనే అంశాలపై లెక్కలు లేవు. అనుమతి వస్తే చాలు గోదావరి అంతా తమదే అన్నట్టుగా మారింది పరిస్థితి.

గోదావరిలో యథేచ్ఛగా ఇసుక దందా

- ఏజెన్సీలో గిరిజన చట్టాలకు తూట్లు
- నిబంధనలకు విరుద్ధంగా యంత్రాల వినియోగం
- రాత్రీపగలు తేడా లేకుండా సాగుతున్న దోపిడీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరిలో ఇసుకాసురులు స్వైర విహారం చేస్తున్నారు. గిరిజన చట్టాలకు అడుగడుగునా తూట్లు పొడుస్తున్నారు. నదీతీరంలో అడ్డగోలుగా మైనింగ్ చేపడుతున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా ఈ అవినీతి వ్యవహారం నిరాటంకంగా సాగుతున్నా అడ్డుకునే వారు కరువయ్యారు.

పేరుకే చట్టాలా ?

జిల్లాలోని అత్యధిక ప్రాంతం ఏజెన్సీ పరిధిలో ఉంది. ఇక్కడ అధికంగా నివసించే గిరిజనుల హక్కులను రక్షించేందుకు ప్రత్యేక చట్టాలు అమల్లో ఉంటాయి. అందులో పీసా చట్టం ఒకటి. ఈ చట్టం ప్రకారం ఏజెన్సీ ఏరియాలో ఇసుక తవ్వకాలు చేపట్టినప్పుడు స్థానికంగా ఉండే గిరిజనులకు లబ్ధి జరగాల్సిందే. అందుకనే ఇక్కడ భారీ మిషన్లతో ఇసుకను తోడడం నిషేధం. కేవలం గిరిజన సొసైటీల ద్వారా ఇసుక మైనింగ్‌ను పర్యవేక్షిస్తూ.. స్థానికంగా ఉన్న కార్మికులతోనే గోదావరిలో ఇసుకను తోడాలి. ఇలా తోడిన ఇసుకను నదీ తీరానికి బయట ఉండే ప్రాంతంలో రీచ్ లేదా స్టాక్ పాయింట్‌కు చేరవేయాలి. స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుకను టీఎస్‌ఎండీసీ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకున్నవారికి లోడ్ చేయాలి. అంటే నదిలో మనుషులు తప్ప యంత్రాలతో పని చేయడానికి అవకాశం లేదు. అలా చేయడం.. గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాల స్ఫూర్తికి విరుద్ధం.

నిబంధనలకు నీళ్లు..

నదిలో యంత్రాలను ఉపయోగించరాదన్న పీసా చట్టం నిబంధనను ఇసుక మాఫియా గోదారిలో కలిపేసింది. జిల్లాలోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఇందులో మెజార్టీ రీచ్‌లలో ప్రొక్లెయినర్, జేసీబీలు, లారీలు, ట్రాక్టర్లను ఎలాంటి సంకోచం లేకుండా గోదావరి నదిలోకి తీసుకెళ్తున్నారు. అక్కడున్న సహజ సంపదైన ఇసుకను క్షణాల్లో యంత్రాల ద్వారా తోడేస్తున్నారు. అలా తోడిన ఇసుకను స్టాక్ పాయింట్లకు చేరవేస్తున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా ఈ దందా కొనసాగిస్తున్నారు. ఈ అన్యాయాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే.. పగటి పూట యంత్రాలను స్టాక్ పాయింట్‌కి పరిమితం చేస్తున్నారు. రాత్రయిందంటే యంత్రాలు తిరిగి గోదావరిలోకి దూసుకెళ్తున్నాయి. యంత్రాలతో ఇసుక తోడటం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ ఇసుక తరలిపోతోంది. ఆమేరకు గిరిజనులకు అన్యాయం జరుగుతోంది. ఇదే సమయంలో ఇసుక మాఫియా కాసుల పెట్టి గలగలమంటోంది.

తనిఖీ మాటే లేదు..

ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలను రవాణా శాఖ పట్టించుకోదు. పీసా చట్టం అమలులో ఉల్లంఘనను స్థానిక రెవెన్యూ విభాగం చూసీ చూడనట్టు వదిలేస్తోంది. తప్పు జరుగుతోందని ఎవరైనా పోలీసులను ఆశ్రయిస్తే వారూ అది తమ పరిధి కాదంటున్నారు. ఇలా మూకుమ్మడిగా అన్ని విభాగాలు పరోక్షంగా మైనింగ్ మాఫియాకు కొమ్ముకాస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

మార్మోగిన రామనామం..





ఇరుముడులతో శ్రీరామ దీక్షాపరులు (ఇన్‌సెట్) స్వామివారికి రథసేవ నిర్వహిస్తున్న భక్తులు

- వైభవంగా శ్రీరామ పునర్వసు దీక్ష విరమణ
- నేడు బేడా మండపంలో శ్రీరామ పట్టాభిషేకం

భద్రాచలం: భద్రగిరి క్షేత్రం రామమయంగా మారింది. శ్రీరామ దీక్షాధారుల రామనామస్మరణలతో పులకించింది. నియమనిష్టలు, భక్తి శ్రద్ధలతో దీక్ష చేపట్టిన భక్తులు గురువారం ఆలయంలో దీక్ష విరమణ చేశారు. తొలుత భద్రుని గుడిలో శ్రీరామ పాదుకలకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. వాటిని ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ శిరస్సుపై ధరించగా మేళతాళాలు, వేద పండితుల ఆశీర్వచనాలు, అర్చకుల మంత్రోచ్ఛరణలు, భక్తులు, శ్రీరామ మాలధారుల జయ జయ ధ్వానాల నడుమ భద్రగిరి చుట్టూ ప్రదక్షిణ చేశారు. బేడా మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాలధారులు స్వామివారికి ఇరుముడులు సమర్పించగా అర్చకులు దీక్షా విరమణ గావించారు. ఆ తర్వాత అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. యాగశాలలో సంక్షేప రామాయణ హవనం గావించారు. సాయంత్రం స్వామి వారికి వెండి రథ సేవ, చుట్టూ సేవలు జరిపారు.

స్వామివారికి నేడు పట్టాభిషేకం..

బేడా మండపంలో స్వామి వారి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు గురువారం కనులపండువగా జరిపారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం బేడా మండపంలో రామయ్యకు నిత్యకల్యాణం అనంతరం పట్టాభిషేకం జరపనున్నారు. కాగా శ్రీరామ దీక్షాపరులకు ఆలయ అధికారులు రూ.100 టికెట్‌తో పట్టాభిషేకంలో పాల్గొనే అవకాశం కల్పించారు. వీరికి శ్రీరామమాడతో పాటు స్వామివారి ప్రసాదాన్ని అందజేయనున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్, ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబ, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్, అదనపు కలెక్టర్



జడ్జికి మొక్క అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన పాటిల్ వసంత్‌ను కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జడ్జికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట ఆర్డీఓ స్వర్ణలత కూడా ఉన్నారు.

పలువురి శుభాకాంక్షలు..

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను స్పెషల్ పోలీస్ ప్రొటెక్షన్ కమాండెంట్ జంగయ్య, కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, త్రీటౌన్ సీఐ అబ్బయ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం జడ్జిని సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొడాలి శ్రీనివాసన్, సున్నం రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

మొబైల్ కోర్టు న్యాయమూర్తిగా శివాజీ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న శివాజీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మొబైల్ కోర్టు న్యాయమూర్తిగా శివాజీ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ కోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్లును ఈనెల 24న ప్రభుత్వం బదిలీ చేసింది. అయినా ఆయన రిలీవ్ కాకపోవడంతో బార్ అసోసియేషన్ సభ్యులు వ్యతిరేకించారు. ఈ క్రమంలో న్యాయవాదులు రవివర్మ, అంబేద్కర్‌ల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో బార్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్ అనుదీప్‌కు వాట్సాప్ ద్వారా ఈ సమాచారం చేరవేశారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే చార్జ్ తీసుకోవాలని సీతారామ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివాజీకి సూచించారు. దీంతో గురువారం శివాజీ బాధ్యతలు చేపట్టారు.

'104' వాహనాలకు వేలం

చుంచుపల్లి: జిల్లాలో పదకొండు 104 వాహనాలకు ఈ ఆక్షన్ ద్వారా వేలం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు వచ్చే నెల 12 వరకు రామవరం ఎంసీహెచ్ వద్ద ఉన్న వాహనాలను సందర్శించవచ్చని పేర్కొన్నారు. మే 17న వేలం ఉంటుందని, వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



కేటీఆర్‌తో ఎమ్మెల్యే, ఎంపీ

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే, ఎంపీ

ఇల్లెందు: బీఆర్‌ఎస్ ఆవిర్భావ సమావేశం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ, మహబూబాబాద్ ఎంపీ కవిత మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, గ్రంధాలయ చైర్మన్ దిండిగల రాజేందర్ సీఎం కేసీఆర్‌ను కలిశారు.

అడవులకు పూర్వ వైభవం

పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్



అళ్లపల్లి రేంజ్‌లో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ లోకేష్, అధికారులు

చుంచుపల్లి: భద్రాద్రి సర్కిల్ పరిధిలోని ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో అడవులకు పూర్వ వైభవం తీసుకొస్తామని అటవీ శాఖ ముఖ్య సంరక్షణాధికారి లోకేష్ జైస్వాల్ అన్నారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడవుల అభివృద్ధికి ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టామన్నారు. 340 ఫారెస్ట్ బ్లాక్‌ల్లోని 6,29,442 హెక్టార్లలో పునర్జీవన పనులు చేపట్టామని తెలిపారు. 361 కిలోమీటర్ల మేర అటవీ సరిహద్దుల వెంట కందకాలు తవ్వించామని, ఐదేళ్లలో 8,619 బౌండరీ పిల్లర్లను నిర్మించామని చెప్పారు. 71 కిలోమీటర్ల మేర అటవీ సరిహద్దుల వెంట ఇనుప కంచె ఏర్పాటు చేశామని, 9.3 కిలోమీటర్ల మేర రక్షణ గోడలను నిర్మించామని వివరించారు. అటవీ ప్రాంతాల్లో జలసంరక్షణకు 5,214 రాతి కట్టడాలు, 388 నీటి కుంటలు, 88 చిన్ని నీటి కుంటలు, 314 చెక్ డ్యామ్‌లు, 29 వాచ్ టవర్లను నిర్మించినట్లు వివరించారు. అటవీ ప్రాంతాల్లో సిబ్బంది నివాసానికి 55 ఇళ్లు నిర్మించామన్నారు. అడవులలో మంటల నివారణకు 3,773 కిలోమీటర్ల మేర ఫైర్‌లైన్లు ఏర్పాటు చేశామన్నారు. 14,012 హెక్టార్లలో ప్లాంటేషన్లను పెంచామని వివరించారు. స్థానిక వృక్ష, గడ్డి జాతుల సంరక్షణకు 2,239 హెక్టార్లలో కలుపు మొక్కలు తొలగించినట్లు చెప్పారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, అడవుల స్థితిగతులపై ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం తెలంగాణలో 632 చ.కి.మీ. మేర అటవీ విస్తీర్ణం పెరిగిందని, దేశంలోనే ఇది రెండో అతిపెద్ద పెరుగుదల అని తెలిపారు.

అభయారణ్యంలో పర్యటన..

ఇల్లెందు/ఇల్లెందు రూరల్/పాల్వంచ/పాల్వంచరూరల్: అభయారణ్యంలోని వన్యప్రాణులు, అడవుల సంరక్షణపై వైల్డ్‌లైఫ్ సిబ్బంది దృష్టి సారించాలని పీసీసీఎఫ్(కంపా) లోకేష్ జైస్వాల్ ఆదేశించారు. కిన్నెరసాని అభయారణ్యం పరిధిలోని ఇల్లెందు, గుండాల మండలాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కాచనపల్లి సెక్షన్‌లో 40 హెక్టార్ల పాత ప్లాంటేషన్, 55 హెక్టార్ల కొత్త ప్లాంటేషన్‌ను తనిఖీ చేశారు. ఇల్లెందు మండలంలోని కోరగుట్ట చుట్టూ కంపా నిధులతో నిర్మిస్తున్న అర్బన్ పార్క్ పనులను కూడా పీసీసీఎఫ్ తనిఖీ చేశారు. తొలుత పీసీసీఎఫ్ కొమురారంలో రేంజ్ కార్యాలయం, పోలారంలో సెక్షన్ ఆఫీసర్ కార్యాలయం, క్వార్టర్లను ప్రారంభించారు. అలాగే, పాల్వంచలో నిర్మిస్తున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీసీఎఫ్ భీమా నాయక్, డీఎఫ్‌ఓలు రవికిరణ్, రంజిత్‌నాయక్, వసంత, సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఎఫ్‌డీఓలు కృష్ణమాచారి, దామోదర్ రెడ్డి, తిరుమల రావు, మక్సూద్, చంద్రశేఖర్, అప్పయ్య, బాబు, మంజుల, రేంజర్లు నర్సింహారావు, జశ్వంత్‌ప్రసాద్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, దీపిక, అనిల్‌కుమార్, డీఆర్‌ఓ సాల్మన్‌రాజు, ఉద్యోగులు సుక్కి, భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను రక్షించండి

డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు



పాల్వంచరూరల్ : బస్వతారక కాలనీలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

పాల్వంచరూరల్/టేకులపల్లి : గ్రామ పంచాయతీల పరిధిలోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణకు వేసవికాలంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు అన్నారు. పాల్వంచ మండలం బస్వతారక కాలనీ, కేశవాపురం, టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ నర్సరీలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నర్సరీల్లోని మొక్కలను మరోసారి షిఫ్టింగ్, గ్రేడింగ్ చేసి ఖాళీ బ్యాగుల్లో మునగ తదితర విత్తనాలు నాటాలని సిబ్బందిని ఆదేశించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీరందించాలని చెప్పారు. గాలికి షేడ్ నెట్లు తెగిపోతే సరిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టేకులపల్లి ఎంపీడీఓ దుద్దుకూరి బాలరాజు, ఏపీఓలు పొరండ్ల రంగా, కాళంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, సాంకేతిక సహాయకులు రవికాంత్, శ్రీను, సుజాత, ధనలక్ష్మి, ఎఫ్‌ఏలు నాగేశ్వరరావు, శంకర్, లఖన్ పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి



భగీరథుడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, కలెక్టరేట్ ఏఓ గన్యా మాట్లాడుతూ.. భగీరథుడి స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం జలసంరక్షణ, నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేసిందని అన్నారు. జలం ఉన్న చోటే నాగరికత, సంస్కృతి ఉంటాయని నమ్మిన భగీరథుడు గంగను భూమి మీదకు తెచ్చి ప్రజలకు అందించారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కార్యదర్శుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్యదర్శులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు గురువారం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ.. తాము ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదని, న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూనే సమ్మె చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న ఎలాంటి అలవెన్సులు తమకు ఇవ్వడం లేదన్నారు. మహిళల మెటర్నిటీ విషయంలో దారుణంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ పల్లెలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం వెనుక తమ కష్టం ఎంతో ఉందని చెప్పారు. ఈనెల 13న కమిషనర్, కలెక్టర్, డీపీఓలకు సమ్మె నోటీసు ఇచ్చామని, అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అనివార్యంగా సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని అన్నారు. అనంతరం డీపీఓ, డీఆర్‌ఓకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు సతీష్, సంపత్, నరేష్, పాషా, ప్రశాంత్, నర్మద, సంజీవ, విజయ, ఉదయ్, రణధీర్, సురేష్, రమేష్, సాయి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓసీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు

ఇల్లెందు: మండలంలోని పూసపల్లి ప్రాంతంలో సింగరేణి సంస్థ ఓసీ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినా నిర్వాసితులకు భరోసా కల్పించలేకపోయిందని ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు ఆరోపించారు. పట్టణంలోని ఎన్డీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఓసీల వల్ల పెట్టుబడిదారులు, దోపిడీదారులకు మాత్రమే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. భూగర్భ గనులను అంతమొందించి ఓసీలు ఏర్పాటు చేయటం వల్ల కార్మికులకు ఉపాధి కరువవుతోందని చెప్పారు. ఈమేరకు ఓసీని అడ్డుకునేందుకు ప్రజా ఉద్యమాలు చేపడుతామని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులకు ఇచ్చే పరిహారంపై స్పష్టంగా చెప్పకపోవడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, తోడేటి నాగేశ్వరరావు, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

తునికాకు బోనస్ విడుదల చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

అశ్వారావుపేటరూరల్: పెండింగ్‌లోఉన్న వంద కోట్ల రూపాయల తునికాకు బోనస్ విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా కోరారు. ఆ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 నుంచి 2021వ సంవత్సరం వరకు బోనస్ పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. మండు వేసవిలో పేదలు సేకరించిన తునికాకుకు బోనస్‌ను ఏళ్ల తరబడి విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం, నాయకులు గన్నిన రామకృష్ణ, సయ్యద్ రఫీ, సంఘం కృష్ణమూర్తి, ఏఐటీయూసీ నాయకులు టీ సత్యనారాయణ, నాగేంద్రబాబు, చీపుర్ల సత్యవతి, షేక్ దిల్షాద్, షేక్ రిజ్వాన పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

మణుగూరు రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహించే రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీలకు మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రసాయనశాస్త్ర విభాగంలో వాటర్ ఎనాలసిస్, జువాలజీ విభాగంలో రోల్ ఆఫ్ విటమిన్ సీ ఇమ్యూనిటీ బూస్టర్స్ అనే ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహమ్మద్ కరీం, సాంబమూర్తి, డాక్టర్ ఎస్.బాబు, పి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

కలప పట్టివేత

చండ్రుగొండ : మండలంలోని టేకులబంజర్ గ్రామంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వేపకలపను గురువారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని రామవరం రేంజర్ ఉమ తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



దీక్షలను ప్రారంభిస్తున్న రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎంవీఎస్ నారాయణ

భద్రాచలంఅర్బన్: ఐకేపీ వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంవీఎస్ నారాయణ కోరారు. వీఓఏల సమ్మె 11వ రోజుకు చేరగా, గురువారం దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు నర్సారెడ్డి, మర్లపాటి రేణుక, కృష్ణమూర్తి సుబ్బయ్య చౌదరి, కన్నయ్యలాల్, మురళీకృష్ణ, నాగరాజు, లక్ష్మణ్, వెంకటలక్ష్మి, చంద్రలీల, సీతారత్నం, జానకి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదీపికల సమస్యలు పరిష్కరించాలి

బూర్గంపాడు: ఐకేపీలో పనిచేస్తున్న గ్రామదీపికల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కోరారు. బూర్గంపాడు ప్రధానకూడలిలో గ్రామదీపికలు చేపట్టిన నిరసన నిరాహారదీక్షలకు గురువారం ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. వీఓఏలు 11 రోజులుగా మండుటెండల్లో నిరసన నిరాహారదీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎంబీ నర్సారెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజని, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, కనకం వెంకటేశ్వర్లు, నిమ్మల అప్పారావు, కొమరాజు సత్యనారాయణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

స్పృహ కోల్పోయిన వీఓఏ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో చేపట్టిన నిరసన దీక్షలో గురువారం చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీకి చెందిన వీఓఏ సఫియా స్పృహతప్పి పడిపోయింది. దీంతో తోటి వీఓఏలు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. దీక్షల్లో రేష్మ, మాధవి, స్వరూప, మునీస, అరుణ, సత్యవతి, జయ, సఫియా, పద్మ, రమణ పాల్గొన్నారు.



స్పృహ కోల్పోయిన సఫియా

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

దుమ్ముగూడెం: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరారు. నష్టపోయిన రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని, రాష్ట్రంలో వడగండ్ల వానలు పరిపాటిగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం విపత్తు సహాయం కింద నిధులు విడుదల చేయాలని కోరారు. మొక్కజొన్నలు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు.

3 నుంచి టీఏజీఎస్ రాష్ట్ర మహాసభలు

వచ్చేనెల 3 నుంచి 6 వ తేదీ వరకు భద్రాచలంలో జరిగే తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు కోరారు. మండలంలోని ములకపాడులో గురువారం యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగా, బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటుందని, ఒకవేళ లేకున్నా సీపీఐతో కుదిరిన ఒప్పందంలో భాగంగా భద్రాచలం అసెంబ్లీ స్థానం నుంచి సీపీఎం పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, యలమంచి రవికుమార్, కారం పుల్లయ్య, యలమంచి శ్రీనుబాబు, బొల్లి సత్యనారాయణ, మర్మం చంద్రయ్య, కొర్సా చిలకమ్మ, మర్మం సమ్మక్క, భూక్యా రమేష్, కుమ్మరికుంట సాంబశివరావు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించాలి

జూలూరుపాడు: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జూలూరుపాడులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నష్టపోయిన రైతులను ఆదుకోకుండా బీఆర్‌ఎస్ నాయకులు మహారాష్ట్రలో చిందులు వేస్తున్నారని విమర్శించారు. కర్ణాటక ప్రజలందరూ తెలంగాణలో కలపాలని కోరుకుంటున్నారని చెప్పిన కేసీఆర్.. కర్ణాటకలో ఎన్నికలు జరుగుతుంటే అక్కడకు వెళ్లకుండా మహారాష్ట్రలో ఎందుకు వెళుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో వరి, మొక్కజొన్నలు చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కోనేరు నాగేశ్వరరావు, నాయకులు మాదినేని సతీష్ కుమార్, నున్నా రమేష్, ఉపేందర్, నూకల రామ్మోహన్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, సిరిపురపు ప్రసాద్, గోపాల్‌రావు, వందనపు సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌సాగర్ పైపుల దొంగలు అరెస్ట్

- నిందితుల నుంచి రూ.6 లక్షల సొత్తు రికవరీ
- ఏడుగురిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

అన్నపురెడ్డిపల్లి: ఆర్‌డీఎల్‌ఐఎస్ (రాజీవ్ దుమ్ముగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్)కు సంబంధించిన ఐరన్ పైపుల చోరీ కేసులో దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. అన్నపురెడ్డిపల్లి మండలంలోని గుంపెన గ్రామ సమీపంలో ఉంచిన 9 పైపుల్లో 4 పైపులు పూర్తిగా, ఒక పైపు సగభాగం చోరీ చేశారు. దీంతో ఇరిగేషన్ ఏఈ మీనా బుధవారం ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం బుచ్చన్నగూడెం గ్రామ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గమనించిన కొందరు ట్రాలీ వాహనంలో పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు గమనించి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా పైపులు చోరీ చేసినట్లు అంగీకరించారు. పాల్వంచ మండలం కరకవాగుకు చెందిన బానోత్ బాబూరావు, అజ్మీర రవి, సడియం మనోజ్‌కుమార్, కొక్కు కోటేశ్వరరావు, బానోత్ నవీన్, గుగులోత్ బుజ్జి గ్యాస్ కట్టర్‌సాయంతో పైపులను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి పాల్వంచలోని దమ్మపేట సెంటర్‌లో ఉన్న పాత ఇనుప షాపు యజమాని వంచదా సత్యానికి విక్రయించారు. చోరీకి గురైన పైపుల విలువ రూ.8,51,600 లక్షలు ఉంటుందని అంచనా. నిందితుల నుంచి రూ.6 లక్షలు, ట్రాలీ వాహనం, గ్యాస్ సిలిండర్, రెండు ఆక్సిజన్ సిలిండర్లు, గొడ్డలి, గ్యాస్ కట్టర్, గ్యాస్ లైటర్లు, వైరు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన ఆరుగురు, చోరీ సొత్తును కొనుగోలు చేసిన షాపు యజమాని.. మొత్తం ఏడుగురిని అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో రిమాండ్ చేసినట్లు డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. కేసును 24 గంటల్లో ఛేదించిన జూలూరుపాడు సీఐ వసంతకుమార్, ఎస్సై షాహీన, ఏఎస్సై పుల్లారావు, కానిస్టేబుళ్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్ ఫీజుల తొలగింపుపై కేసు నమోదు

దమ్మపేట: గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే ఫీజులు తొలగించిన ఓ కుటుంబంపై గురువారం రాత్రి కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నాచారం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన చీకటి వెంకటేశ్వరరావు, చీకటి అన్నపూర్ణ, చీకటి సాయికిరణ్ కారం మిల్లు నడుపుతున్నారు. అయితే ఆ మిల్లు కారణంగా శబ్ద కాలుష్యం ఏర్పడుతోందని కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు గ్రామస్తుడు ఫిర్యాదు చేయగా, ఆ మిల్లును తొలగించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కారం మిల్లు తొలగించాలని విద్యుత్ శాఖ ఉద్యోగులు చెప్పినా.. వారు వినకపోవడంతో ఆ మిల్లుకున్న విద్యుత్ కనెక్షన్‌ను తీసేశారు. దీంతో ఆగ్రహించిన నిందితులు ఆ గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు తొలగించారు. ఈ విషయంలో పోలీసులు, విద్యుత్ ఉద్యోగులు ఎంత నచ్చజెప్పినా వినకపోగా.. చీకటి అన్నపూర్ణ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో విద్యుత్ శాఖ ఏఈ జల్లిపల్లి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

అటవీ, రెవెన్యూ అధికారుల విచారణ

జూలూరుపాడు: సీతారామ ప్రాజెక్ట్ నిర్వాసిత రైతుల భూముల్లో గురువారం అధికారులు విచారణ చేపట్టారు. సీతారామ కాల్వ నిర్మాణంతో భూములు కోల్పోయిన పాపకొల్లు, పుల్లుడుతండా(భోజ్యా తండా) గ్రామాలకు చెందిన రైతులు నష్టపరిహారం రాలేదంటూ సోమవారం గ్రీవెన్స్(ప్రజావాణి)లో కలెక్టర్ అనుదీప్‌కు వినతి పత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు(ఎస్ఆర్ఎల్ఐపీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ) శివాజీ, అటవీశాఖ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు జాయింట్ ఎంక్వయిరీ నిర్వహించారు. సీతారామ కాల్వ నిర్మాణం చేపట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఎస్‌డీసీ శివాజీ తెలిపారు. జూలూరుపాడు తహసీల్దార్ శారద, ఎఫ్‌డీఓ జి ప్రసాద్‌రావు, ఇరిగేషన్ డీఈ బాలాజీ, రెవిన్యూ, అటవీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమెర్దలో మళ్లీ జ్వరాలు..

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీలో మళ్లీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. అమెర్ద కాలనీలో ఇంటికొకరు జ్వరాలతో బాధపడుతూ గ్రామంలో సుమారు 20 మంది జ్వరాల బారిన పడ్డారు. పలువురు డెంగీ, టైఫాయిడ్ జ్వరాలతో, కొందరు సాధారణ జ్వరాలతో బాధపడుతున్నారు. అశ్వాపురం పీహెచ్‌సీ, భద్రాచలం ఏరియా ఆస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇటీవల గ్రామంలో జ్వరాలు విజృంభించి ముగ్గురు మృతి చెందిన సంగతి తెలిసిందే. గ్రామంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, ఇంటింటి సర్వే నిర్వహించి వైద్య సేవలందించడంతో జ్వరాలు తగ్గుముఖం పట్టాయి. మళ్లీ గ్రామంలో జ్వరాలు విజృంభిస్తుండటంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరుతున్నారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు

వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: మావోయిస్టు దంపతులు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ.రంగనాథ్ ఎదుట లొంగిపోయారు. ఈమేరకు గురువారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా (పూర్వ గుంటూరు జిల్లా), మాచర్ల మండలం కంబంపాడు గ్రామానికి చెందిన కాసరనేని రవికుమార్ అలియాస్ అజిత్ అలియాస్ మున్నా అలియాస్ సూర్య భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు డివిజనల్ కమిటీ మెంబర్, మణుగూర్ ఎల్‌ఓఎస్ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బత్తినపల్లికి చెందిన మడివి సోమిడి అలియాస్ కల్పన మణుగూరు – పాల్వంచ ఏరియా కమిటీ మెంబర్‌గా, మణుగూరు ఎల్‌ఓఎస్ డిప్యూటీ కమాండర్‌గా పనిచేస్తున్నారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చకపోవడంతోపాటు, పార్టీపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లడం, పార్టీకి చెందిన కీలక నాయకులు లొంగిపోవడం, పలువురికి ఆరోగ్య సమస్యలు రావడం వంటి కారణాలతో వీరిద్దరు లొంగిపోయారని సీపీ తెలిపారు. కాగా, వీరిలో రవికుమార్‌పై రూ.5లక్షలు, కల్పనపై రూ.4లక్షల రివార్డు ఉందని ఉందని చెప్పారు.



మావోయిస్టు దంపతుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ రంగనాథ్

2017లో అజ్ఞాతంలోకి...

చర్ల: మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న చర్ల మండలం బట్టీగూడేనికి చెందిన మడివి సోమిడి అలియాస్ కల్పన గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎదుట లొంగిపోయారు. చర్ల మండలంలోని బత్తినపల్లి సమీపంలోని ఆదివాసీ గ్రామమైన బట్టీగూడేనికి చెందిన సోమిడి 2017లో మావోయిస్టు పార్టీలో చేరింది. రెండేళ్ల క్రితం మణుగూరు ఎల్‌ఓసీ కమాండర్‌గా పని చేస్తున్న కాసరనేని రవికుమార్ అలియాస్ గుంటూరు రవిని వివాహం చేసుకుంది. కాగా, 2018లో చర్ల ఎల్‌ఓసీ సభ్యురాలిగా, 2020లో మణుగూరు ఏరియా కమిటీ సభ్యురాలిగా పనిచేసి, ప్రస్తుతం మణుగూరు ఎల్‌ఓఎస్ డిప్యూటీ కమాండర్‌గా పని చేస్తున్న సోమిడి భర్తతో కలిసి లొంగిపోయింది.

ఫారెస్ట్ సిబ్బంది బైక్ దగ్ధం

చండ్రుగొండ : చండ్రుగొండ ఫారెస్టు రేంజి పరిధి మద్దుకూరు అటవీప్రాంతంలో అటవీశాఖ బేస్‌క్యాంపులో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బైక్‌ను గుర్తుతెలియని దుండగులు గురువారం తగులబెట్టారు. రేంజ్ అధికారి జి.ప్రసాదరావు కథనం ప్రకారం.. బేస్ క్యాంపులో పనిచేసే దండుగుల రాములు ఉదయం తన ద్విచక్రవాహనంపై అటవీప్రాంతంలోకి వెళ్లాడు. అటవీ ప్రాంతంలో ఓ చోట వాహనం ఉంచి లోపలిప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్లి, తిరిగి మధ్యాహ్నం వచ్చాడు. అప్పటికే బైక్ మంటల్లో దగ్ధమైంది. బైక్‌ను కొంతదూరంలోని వాగు వద్దకు తీసుకెళ్లి వాహనంపై చెత్తాచెదారం వేసి నిప్పంటించిన ఆనవాళ్లు ఉన్నాయని రేంజర్ తెలిపారు. మద్దుకూరు గ్రామానికి చెందిన వారే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని రేంజర్ ప్రసాదరావుతోపాటు ఎస్ఐ గొల్లపల్లి విజయలక్ష్మి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దుశ్చర్యకు పాల్పడింది పోడుదారులా లేక గొత్తికోయలా? వ్యక్తిగత కక్షలతో మరెవరైనా చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా బైక్ విలువ రూ.70 వేలు ఉంటుందని అంచనా.



సంఘటనా స్థలంలో పరిశీలిస్తున్న అధికారులు

పందెంరాయుళ్ల అరెస్ట్

బూర్గంపాడు: కోడిపందేల నిర్వహణకు ఇన్నోవా వాహనంలో వెళ్తున్న ఆరుగురు వ్యక్తులను సారపాక వద్ద గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2.84లక్షల నగదు, వాహనం, మూడు మొబైల్ ఫోన్లు, ఐదు పందెంకోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టుకు పంపినట్లు ఎస్సై సంతోష్ తెలిపారు.

ఐదు కరోనా కేసులు నమోదు

చుంచుపల్లి: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల పరిధిలో గురువారం నిర్వహించిన కోవిడ్ పరీక్షల్లో ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా తేలింది. మొత్తం 273 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు.

మూడు వాహనాలు ఢీ

- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు
- ప్రమాదానికి గురైన వాహనాల్లో మృతదేహం తరలిస్తున్న ఆటో

మణుగూరుటౌన్: మండలంలోని తిర్లాపురం గ్రామసమీపంలో బుధవారం అర్ధరాత్రి మణుగూరు–ఏటూరునాగారం ప్రధాన రహదారిలో మూడు వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మండల పరిధిలోని పగిడేరు పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన సున్నం లక్ష్మి అనారోగ్యంతో భద్రాచలంలో మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఆటోలో పగిడేరుకు తీసుకొస్తున్నారు. అదే సమయంలో పాములపల్లికి చెందిన తండ్రీకొడుకులు మడవి మంగయ్య(48), రమేష్ ద్విచక్రవాహనంపై తిర్లాపురం నుంచి మణుగూరు వైపు వస్తున్నారు. ఆటోను క్రాస్ చేస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ చందా సంతోష్ స్కార్పియో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ పక్కనే ఉన్న ఆటోకు తగలడంతో.. ఆటో పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వస్తున్న మంగయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనం నడుపుతున్న రమేష్‌తోపాటు ఆటోలో ఉన్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మరికొందరు కూడా స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగయ్య మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



మల్లికార్జున్ (ఫైల్)

పినపాక: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఒప్పాక గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కళ్యాణం మల్లికార్జున్ (42) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మహేశ్వరరావు అనుమానాస్పద మృతిగా ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ దిలీప్ కేసు నమోదు చేశారు.

గ్యాస్ లీకై బాలుడికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: గ్యాస్ లీకై, మంటలు వ్యాపించి ఓ బాలుడు గాయపడిన ఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో ఉన్న ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను నిర్వాహకుడు అక్కడే పని చేస్తున్న మైనర్ బాలుడు కె.గణేష్‌కు అప్పగించి బయటకు వెళ్లాడు. ఆ సమయంలో బాలుడు గ్యాస్ పొయ్యి వెలిగించే క్రమంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో బాలుడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపు చేసి బాలుడిని రక్షించారు. అనంతరం చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా త్రుటిలో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు చెబుతున్నారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి



బోల్తాపడ్డ ట్రాక్టర్

జూలూరుపాడు : ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని సురారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సురారం గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ యజమాని వద్ద అదే గ్రామానికి చెందిన మాళోత్ వంశీ(30) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రైతు పొలం దుక్కి దున్నుతున్న క్రమంలో రివర్స్ చేస్తుండగా పక్కనే ఒర్రె ఉండటంతో ట్రాక్టర్ పల్టీ కొట్టింది. డ్రైవర్ వంశీ ట్రాక్టర్ కిందపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ట్రాక్టర్ యజమాని డ్రైవర్ వంశీకి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. దీంతో పొలం వద్దకు వెళ్లగా ట్రాక్టర్ బోల్తాపడి, వంశీ మృతి చెంది ఉన్నాడు. గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్ కింద ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహం వద్ద కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వంశీ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదం వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.